ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ఓటు హక్కు వినియోగించుకోనున్న 225మంది ఓటర్లు
- వీరితో పాటు ఇద్దరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీకి ఓటు హక్కు

గద్వాల, మార్చి 27 : నేడు జరిగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలకు సంబంధించిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు ఓటు హక్కు వినియోగించుకోవడానికి జిల్లా కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు.జిల్లాలో మొత్తం 233మంది ఓటర్లు ఉండగా అందులో ముగ్గురు చనిపోగా ఐదుగురు అభ్యర్థులు డిస్‌క్వాలిఫై అయ్యారు.ప్రస్తుతం 225మంది ఓటర్లతోపాటు ఇద్దరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. గద్వాల నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యేతో కలుపు కొని 107మంది అభ్యర్థులు ఉండగా అందులో 64మంది ఎంపీటీసీలు, ఐదుగురు జెడ్పీటీసీలు, 37మంది కౌన్సిలర్లు ఉన్నారు. అలంపూర్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 118 మంది ప్రజాప్రతినిధులు ఉన్నారు. అందులో 69మంది ఎంపీటీసీలు, 7మంది జెడ్పీటీసీలు, 40 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరితో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఓటర్ల వివరాలు..

జెడ్పీటీసీలు –12,

మున్సిపాలిటీల వారీగా కౌన్సిలర్ల వివరాలు

గద్వాల – 37, అయిజ – 20, వడ్డేపల్లి –10, అలంపూర్ –10 మంది కౌన్సిలర్లు ఓటు వేయనున్నారు.

ఎంపీటీసీలు మండలాల వారీగా..

గద్వాల–13, ధరూర్–12, కేటీదొడ్డి–11, గట్టు–15, మల్దకల్–13, అలంపూర్–5, ఉండవెల్లి–10, అయిజ–15, వడ్డేపల్లి–05, ఇటిక్యాల–15, మానవపాడు–09, రాజోళి–10మంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ఏర్పాట్లు పూర్తి చేశాం: అదనపు కలెక్టర్

నేడు జరుగనున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానికసంస్థల శాసన మండలి ఉపఎన్నిక పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.జిల్లాలో 225 మంది ప్రజా ప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. వీరితో పాటు గద్వాల,అలంపూర్,శాసన సభ్యులతో పాటు ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రం వద్ద 100మీటర్ల పరిధిలో మార్క్‌వేసి బారికేడులు ఏర్పాటు చేయాలని, పోలింగ్ కేంద్రంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎన్నికల నిర్వాహక అధికారులకు ఆదేశించారు. ఓటర్లు క్యూపద్ధతి పాటించి ఓటింగ్ వేసేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట జెడ్పీసీఈవో కాంతమ్మ, ఎన్నికల సూపరింటెండెంట్ నరేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

వనపర్తి, మార్చి 27(నమస్తే తెలంగాణ) : నేడు జరుగనున్న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు వనపర్తి ఆర్డీవో కార్యాలయంలో 4వ నెంబర్ పోలింగ్ కేంద్రం సిద్ధమైంది. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ నగేశ్‌తో కలిసి బుధవారం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో మొత్తం 218మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రం చుట్టూ వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలని, అనుమతిలేని వ్యక్తులను పోలింగ్ కేంద్రం పరిసరాల్లోకి రాకుండా నిరోధించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఆర్డీవో పద్మావతి, ఎన్నికల సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు. కాగా జిల్లాలోని 14 మండలాలు, 5 మున్సిపాలిటీలో ఉన్న జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లతోపాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌లో పాల్గొంటారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ఆత్మకూర్ మండలంలో 18 ఓట్లు

ఆత్మకూరు, మార్చి 27 : మండలంలో మొత్తంగా 13గ్రామపంచాయతీలు ఉండగా 7మంది ప్రాదేశిక సభ్యులు, ఒక మండల కోఆప్షన్ సభ్యుడు ఉన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో 10మంది కౌన్సిలర్లతో మొత్తంగా 18 మంది ఓటర్లు ఉన్నారు. 18 మందిలో అత్యధికంగా బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులే ఉన్నారు. మొత్తంగా 18ఓట్లలో 10మంది ఓటర్లు బీఆర్ఎస్ ప్రతినిధులు ఉండగా 4 గురు కాంగ్రెస్, 3 బీజేపీ, 1 మండల కోఆప్షన్ బీఆర్ఎస్ ప్రతినిధులు ఉన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రానీయొద్దు

- వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్


తాగునీరు, ఉపాధిహామీ పనులపై మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి,మార్చి 27: వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ తేజస్‌నంద లాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో తాగునీటి సమస్య, ఉపాధిహామీ పనులపై అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్‌లతో బుధవారం వెబెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా మిషన్ భగీరథ నీటిని విడుదల చేయడంలో అధికారులు సమన్వయంతో ఉండాలన్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకు స్థానికంగా ఉన్న బోర్లు, మోటర్లు రిపేర్లు చేయించాలని, లీకేజీలు లేకుండా మూసుకోవడం అవసరమైతే ప్రైవేట్ బోర్లు లీజుకు తీసుకొని నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని సూచించారు. పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ సిబ్బంది ఉదయాన్నే క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారంలో 3 రోజులు తప్పనిసరిగా పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. ప్రజలు వారి సమస్యలను తెలిపేందుకు పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారి, ఎంపీడీవో, ఎంపీవో, ఆర్‌డబ్ల్యూఎస్, అదనపు కలెక్టర్ ఫోన్ నెంబర్లు ప్రతి గ్రామపంచాయతీ భవనం బోర్డు మీద రాయించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

లేబర్ మొబిలైజేషన్ పెంచాలి..

ఉపాధి హామీ పనుల్లో లేబర్ మొబిలైజేషన్ తక్కువ ఉందన్న కారణాలపై నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, షేడ్ నెట్స్ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి వారం సకాలంలో మస్టర్ పూర్తి చేసి సమయానికి కూలీ డబ్బులు అందేవిధంగా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో ఉమాదేవి, డీపీవో రమణామూర్తి, మిషన్ భగీరథ ఎస్ఈ జగన్మోహన్, వెబ్ ఎక్స్ ద్వారా ఎంపీడీవోలు, ఏపీవోలు, డీఈలు , ఏఈలు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జీఎంఆర్‌కు రైస్‌మిల్లర్ల సన్మానం

దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న రైస్‌మిల్లర్లు

కొత్తకోట, మార్చి 27: దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డిని జిల్లా రైల్‌మిల్లర్స్ సంఘం ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించినట్లు జిల్లా రైల్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వనాథం, సభ్యులు వెంకట రమణ, శంభుప్రసాద్ తెలిపారు. బుధవారం వారు మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలువాతో సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్ మాదంశెట్టి, భాస్కర్ ఉన్నారు.

ఆస్తిపన్ను చెల్లింపునకు నాలుగు రోజులే గడువు

అయిజ, మార్చి 27: 2023-24 ఏడాదికిగానూ ఆస్తిపన్ను చెల్లింపునకు నాలుగు రోజులే గడువు ఉందని కమిషనర్ సత్యబాబు సూచించారు. ఆస్తిపన్ను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ సత్యబాబు ఆస్తిపన్ను వసూళ్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. రెవెన్యూ, బిల్ కలెక్టర్లు ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈనెల చివరిలోగా వందశాతం పన్నులు వసూలు చేయాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ రాజేశ్‌కుమార్, రెవెన్యూ, బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు మాకు వర్తించవు

- ఆటోలతో కాంగ్రెస్ ప్రచారం

జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్లెక్సిలతో ఆటో ప్రచారం

గద్వాల టౌన్, మార్చి 27 : ఎన్నికల నిబంధనలు మాకు వర్తించవు..మేము అధికారంలో ఉన్నాం..మేము ఏమి చేసినా చెల్లుతుంది...అధికారులు సైతం చూసీచూడనట్లుగా ఉండాలి అంతే... అందుకు తగ్గట్టుగానే అధికారులు వ్యవహరిస్తున్నారు.. జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి అధికారులు... పోలీస్ అధికారులు ఉన్నా ఎన్నికల కాంగ్రెస్ పార్టీ మాత్రం నిబంధనలు ఏ మాత్రం పట్టించుకోకుండా ప్రచారాన్ని కొనసాగిస్తుంది. పార్టీ అభ్యర్థి ఫొటో సైతం ఉంచి వీధుల్లో ఆటోలను తిప్పుతూ ముందస్తు ప్రచారానికి తెర తీసిందన్న విమర్శలు ప్రజలు నుంచి వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీకి ఎన్నికల నియమావళి వర్తించదా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఈ పరిస్థితి ఉంటే మండల, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల కోడ్‌ను అధికారులు ఏవిధంగా అమలు చేస్తారో అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది..

- స్వీప్ మోడల్ అధికారి రమేశ్‌బాబు

గద్వాల అర్బన్, మార్చి 27 : ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా 18 ఏండ్లు నిండిన యువత ఓటరుగా తమ పేరును నమోదు చేసుకునే విధంగా చర్యలు చేపట్టినట్లు స్వీప్ మోడల్ అధికారి రమేశ్‌బాబు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో స్వీప్ కోర్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీలో చదువుకునే విద్యార్థులు ఏప్రిల్ 15వరకు ఫామ్-6 ద్వారా తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించేందుకు కృషి చేయిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన 5కే రన్ నిర్వహించి వివిధ కాలేజీల యువతి,యువకులను భాగస్వాములు చేసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు నర్సింగ్ రావు, ఆరీఫుద్దీన్, కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీపతి నాయుడు ఉన్నారు.

పశువులకు వ్యాక్సిన్ వేయించాలి

- పశువైద్యాధికారి శంకరయ్య

గద్వాల రూరల్, మార్చి 27 : పాడిరైతులు తమ పశువులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వ్యాక్సిన్ వేయించాలని పశువైద్యాధికారి శంకరయ్య అన్నారు. మండలంలోని పరుమాల, చింతలపేటలో గేదెలు, ఆవులు, ఎద్దులకు గాలికుంటు నివారణ టీకాలను పశువైద్య సిబ్బందితో కలిసి బుధవారం వేశారు. కార్యక్రమంలో సిబ్బంది మాధవిలత, తేజస్విని, రాముడు, కృష్ణయ్య, ప్రభాకర్, నర్సింహులు, జహంగీర్, ఫణీంద్ర, బుద్ధుడు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

- నాలుగు కిలోల వెండి కవచం అపహరణ

పెద్దమందడి, మార్చి 27 : మండలంలోని వెల్టూరు గ్రామ ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి నాలుగు కిలోల వెండి కవచం అపహరించిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. ఆలయ అర్చకుడు అందుబాటులో లేకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆలయ పెద్దలు బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుంకర యాదయ్య తెలిపారు. దీంతో ఎస్సై శివకుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ఆలయ పరిసరాలను పరిశీలించారు. గతంలో అప్పటి ఎస్సీ అపూర్వారావు సీసీ కెమెరాలను ప్రారంభించిందని అవి నెలరోజులు నడిచి నిద్రపోతున్నాయని గ్రామస్తులు వాపోయారు. అప్పటి నుంచి నేటి వరకు సీసీ కెమెరాలు పనిచేయడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ కెమెరాలు పనిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

వనపర్తి, మార్చి 27: సెక్టార్ ఆఫీసర్లు , పోలీస్ సెక్టార్ ఆఫీసర్లు తమ విధులపై పూర్తి అవగాహన కల్గించి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సెక్టార్ అధికారులు, పోలీస్ సెక్టార్ అధికారుల సమావేశంలో కలెక్టర్ పాల్గొని దిశానిర్ధేశం చేశారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సెక్టార్ అధికారులు ప్రతినిధులని వారు ఎంత సమర్థవంతంగా పనిచేస్తే ఎన్నికలు అంత సజావుగా ప్రశాంతంగా పూర్తి అవుతాయన్నారు. అందుకే సెక్టార్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రూట్ సరిగ్గా అర్థం చేసుకోవడం స్థానిక సమస్యలను ఆకలింపు చేసుకొని ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద చలువ నీడ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు రమేశ్‌రెడ్డి ,ఆఫీసర్లకు వారి బాధ్యతలపై అవగాహన కల్పించారు. సమావేశంలో సెక్టార్ అధికారులు, పోలీస్ సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

సకల కళల సమాహారం నాటకం

వనపర్తి టౌన్, మార్చి 27: నాటకం సకల కళల సమాహారమని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ రంగస్థల కళాకారుడు, జిల్లా అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్‌ను కళావేదిక ప్రతినిధులతో కలిసి ఆయన తన కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతి ప్రాచీనమైన నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎంత ఉన్నత ఉద్యోగంలో ఉన్నప్పటికీ నిత్యం నాటక రంగాన్ని అభిమానిస్తూ , ఆరాధిస్తున్న గొప్ప కళాకారులు అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్ అని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీధర్, జనజ్వాల , చిన్నమ్మా థామస్, ఎస్.చంద్రశేఖర్, మల్యాల బాలస్వామి, సత్తార్, గంధం నాగరాజు, బైరోజు చంద్రశేఖర్, డాక్టర్ శ్యాంసుందర్, నంది మల్ల రాములు, రాందొడ్డి, బుచ్చిబాబు, బండారు శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, శ్రీలక్ష్మి, అరుణ, రాజు ఉన్నారు.

అదనపు ఎస్పీని సన్మానిస్తున్న సాహితీ కళావేదిక ప్రతినిధులు

ధాన్యం కొనుగోలుకు 64 కేంద్రాలు ఏర్పాటు

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

గద్వాల, మార్చి 27 : యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని సేకరించేందుకు జిల్లాలో 64కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 4వ తేదీన జిల్లాలో మొదటి విడుతగా 32 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. గద్వాల మండలంలో 18, గట్టులో 5, కేటీదొడ్డిలో 9 మొత్తం 32 కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన 32 కేంద్రాలు ఏప్రిల్ 10న రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో 43, పీఏసీసీఎస్ ఆధ్వర్యంలో 21కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఐకేపీ, పీఏసీసీఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు చేసే వారికి కలెక్టరేట్‌లో ఒక రోజు కొనుగోళ్ల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏ-గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2203, సాధారణ రకానికి క్వింటాకు రూ.2,183 మద్దతు ధర చెల్లిస్తామని తెలిపారు. రైతులకు మద్దతు ధర లభించాలంటే రైతులు తప్పని సరిగా ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతం 17కు తగ్గకుండా చూసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు తప్పకుండ బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డ్, పట్టాపాస్‌బుక్ తీసుకరావాలన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యం తరలి రాకుండా నందిన్నె, ఇర్కిచెడ్ , బల్గెర, ర్యాలంపాడ్, సుంకేసుల, ఖైరపురంల వద్ద ఏడు తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని సూచించారు.

అదుపుతప్పిన బస్సు ప్రయాణికులకు గాయాలు

ఉండవెల్లి మార్చి 27 : ప్రవైట్ ట్రావేల్స్‌కు చెందిన బస్సు అదుపుతప్పి సూచిక దిమ్మెలను ఢీకొని ఆరుగురికి గాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకున్నది. స్థానికులు తేలిపిన వివరాలు ఎన్ఎల్ 01బి 4949అనే నంబర్ గల బస్సు బుధవారం తేలవారుజామున 1గంటకు హైదరాబాద్ నుండి 26మంది ప్రయాణికులతో పొద్దుటూర్‌కు బయలుదేరింది. ఉండవెల్లి మండలం పుల్లూరు టోల్‌గేట్ సమీపంలో డ్రైవర్ జనార్ధన్‌రెడ్డి నిద్రమత్తులోకి జరుకోవడంతో బస్సు అదుపుతప్పి 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న సూచిక దిమ్మెలను ఢీకొని వాగులోకి దుసుకోని వెళ్లింది. దీంతో బస్సు అద్దాలు పగిలి డ్రైవర్ జనార్ధన్‌రెడ్డికి ఎడమ కాలు విరిగింది. అలాగే ఐదు మంది ప్రయాణికులకు తీవ్ర రక్త గాయాలైన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. గాయపడిన వారిని కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

పేకాట, కోడి పందేలు ఆడే వారిపై కఠిన చర్యలు

- జోగుళాంబ గద్వాల ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, మార్చి 27 : జిల్లాలో పేకాట, కోడి పందేలు ఆడేవారు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసు కుంటామని ఎస్పీ రితిరాజ్ గురువారం ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకొని కఠినంగా వ్యవహరిస్తామని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, పబ్లిక్‌లో అవాంఛనీయ ఘటనలు చేసే వారు ఎవరైనా సరే ఉపేక్షించేది లేదని తగు చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

మదనాపురం, మార్చి 27 : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మండలకేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం నుంచి 6రోజుల పాటు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని కేవీకే సీనీయర్ శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. 'సేంద్రియ వ్యవసాయం' అనే అంశంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, కంపోస్టు తయారీ పద్ధతులు, సేంద్రియ పదార్థాల తయారీ, జీవ రసాయనాల తయారీ, క్షేత్ర పర్యటనలు వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొనదలిచిన రైతులు, నిరుద్యోగ యువత మదనాపురం కేవీకేకు వచ్చి పాస్ ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

సీఎంఆర్ రైస్‌ను అందించాలి

పాన్‌గల్, మార్చి27: 2023-24 ఏడాది వానకాలం సీజన్‌కుగానూ పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ రైస్‌ను భారత ఆహారసంస్థకు సకాలంలో అందజేయాలని తాసీల్దార్ శుభాష్‌నాయుడు అన్నారు. మండలంలోని మాందాపూర్, బుసిరెడ్డిపల్లి, కేతేపల్లి, గోప్లాపూర్‌లోని రైస్ మిల్లులను బుధవారం తనిఖీ చేశారు. ఈసంవత్సరానికి ఇవ్వాల్సిన బియ్యం కోటాను ఈనెల చివరివరకు అందజేయాలని సీఎంఆర్ రైస్ మిల్లుల యజమానులను ఆదేశించారు. తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

ఆటో బైక్ ఢీ : వ్యక్తికి గాయాలు

అమరచింత, మార్చి 27: ఆటోను బైక్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మంగళవారం రాత్రి మండలంలోని మస్తీపూర్ శివారులో చోటు చేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం నందిమల్ల గ్రామానికి చెందిన నర్సింహ మోటర్‌బైక్‌పై సొంత గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ప్యాసింజర్ ఆటోను ఢీకొన్నాడు. ఈప్రమాదంలో నర్సింహకు గాయాలు కాగా 108లో ఆత్మకూరు దవాఖానకు తరలించారు.

మత్స్యకారుడు మృతి

గోపాల్‌పేట, మార్చి 27 : చేపల వేట ముంగించుకొని ఇంటికి వచ్చిన మత్స్య కారుడు ఇంటి వద్ద అకస్మాత్తుగా మృతిచెందిన ఘటన మండలంలోని బుద్ధారంలో చోటు చేసుకున్నది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు..గ్రామానికి చెందిన వాకటి నాగన్న (58) మంగళవారం ఉదయం గ్రామ మత్స్యకారులతో కలిసి బుద్ధారం గండి చెక్ డ్యాంలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలవేట ముగించుకొని సాయంత్రం ఇంటికి వచ్చి భోజనం చేసి ఇంటి ఎదుట పడుకున్నాడు. రాత్రి కావడంతో అతడి భార్య తిరుపతమ్మ ఇంట్లో పడుకునేందుకు లేపగా, కదలక పోవడంతో చుట్టుపక్కల వారు వచ్చి పరీక్షించగా అప్పటికే అతడు మృతి చెందాడు. మృతుడికి కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

మల్దకల్, మార్చి 27 : మండలంలోని బిజ్వారం గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైన ఘటన ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్సై సురేశ్ గౌడ్ వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వడ్డె సరోజమ్మ (52) భర్త వడ్డె గోకారన్నతో నిత్యం కుటుంబ సమస్యలపై గొడవ పడుతుండేది. అయితే ఈనెల 24వ తేదీన కూడా భర్తతో గొడవపడి ఆదివారం ఉదయం 9గంటలకు గ్రామం నుంచి గద్వాల జిల్లా కేంద్రానికి వెళ్తున్నట్లు కొడుకు అంజికి తెలిపి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాక పోవడంతో బంధువుల ఇండ్లల్లో వెతికినా కనిపించలేదు. దీంతో కుమారుడు అంజి ఫిర్యాదు మేరకు బుధవారం మిస్సింగ్ కేసును నమోదు చేశామన్నారు.

సింగిల్‌విండో బలోపేతానికి పాటుపడుదాం

- డీసీసీబీ డైరెక్టర్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్,మార్చి 27: రుణాలను రైతులు సకాలంలో చెల్లించి సింగిల్‌విండో బలోపేతానికి కృషి చేయాలని డీసీసీబీ డైరెక్టర్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో బుధవారం రైతులతో మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24సంవత్సరానికిగానూ రైతులకు రూ.2,78,89,855 పంటరుణాలు ఇచ్చినట్లు తెలిపారు. స్వయం ఉపాధి కింద రూ.1,95,95,554 రుణాలు ఇచ్చామన్నారు. అదేవిధంగా వానకాలంలో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 190మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.42కోట్లు వ్యాపారం చేసినట్లు వివరించారు. సమావేశంలో జెడ్పీకోఆప్షన్ సభ్యుడు మునీరుద్దీన్, విండో వైస్ చైర్మన్ బాలయ్య, డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, సీఈవో భాస్కర్‌గౌడ్, రైతులు తదితరుల